# కథ

ఎన్.వెంకటేశ్వర పట్నాయక్

# సమ్మోహం

**"తప్పేమోనే...ఇలా చేయడం..ఈ పద్ధతి అంత మంచిది కాదేమోనని నా అభిప్రాయం" ఆలోచిస్తూ వైష్ణవితో చెప్పింది లలాట. గత ఐదేళ్ళుగా వాళ్లిద్దరూ మంచి స్నేహితురాళ్లు. గ్రాడ్యుయేషన్ చేస్తున్న వాళ్ళకిది ఫైనల్ ఇయర్.**

''ఇది నువ్వనుకునేంత తప్పుకాదు అల్లూ. పైగా పూర్తిగా నా స్వంత విషయం. ఫలితం తెలుసుకోవాలిగా.. పైగా ఏభయ్యేళ్లు కలిసి జీవించవలసిన వ్యక్తిని ఈమాత్రం పరీక్షించటంలో సందేహం అనవసరం'' ధీమాగా చెప్పింది వైష్ణవి.

''వైష్ణవీ..'' కన్విన్సింగ్‌గా ఉంది లలాట గొంతు.

''రెండేళ్లుగా కార్తీక్ అంటే ఏమిటో మనకే కాదు కాలేజ్ మొత్తం తెలుసు. తెలివితేటలే కాదు మంచితనం, కలివిడితనం, డైనమిక్ నేచర్ ఉన్న వ్యక్తి. అలాంటి వాడికి నువ్వు ప్రేమించకముందే ఇలాంటి పరీక్ష చేయాల్సింది. కానీ ప్రేమించి ఏడాదైన తర్వాత ఇప్పుడిలా అంత అవసరమంటావా?'' ఇంకా వెనక్కు లాగటానికే ప్రయత్నిస్తోంది లలాట.

''తప్పదు. నేను పెళ్లి చేసుకోబోయే అబ్బాయికి కొన్ని నైతిక విలువలుండాలి. అవకాశం ఉన్నప్పుడు కూడా అనుచితంగా ప్రవర్తించకుండా ఉండాలి. దానికోసమే ఈ టెస్ట్..''

ఫైనల్‌గా నువ్వు చేస్తావా? చెయ్యవా? అన్నట్లు మాట్లాడింది వైష్ణవి.

''సరే నీ ఇష్టం..నేనిప్పుడే అభిసారికతో మాట్లాడుతా. రేపు ఆదివారం ఫస్ట్ షో కే కదా!''

''ఎగ్జాక్ట్‌లీ బై సిక్స్ పి.ఎమ్.'' అని చెప్పి ఓ కరెన్సీ కట్ట లలాట చేతిలో ఉంచింది.

★ ★ ★

ఒళ్లంతా స్వేదంతో తడిసిపోతున్నా ఆపకుండా బాస్కెట్ బాల్ ప్రాక్టీసు చేస్తున్న కార్తీక్ దగ్గరకొచ్చి సెల్ అందించాడు వినయ్.

''యస్ కార్తీక్ హియర్''

''దీసీజ్ వైష్ణవి...కార్తీక్''

''వాటె సర్‌ప్రైజ్...జస్ట్ ఏ మినిట్'' అంటూ బాటిల్‌లోని నీళ్లు గొంతులోకి ఒంపుకుని-

''కమాన్ విషీ..ఏంటిలా చేశావ్?''

''రేపు సండే నువ్వు ఫ్రీగానే ఉంటావా?''

''మధ్యాహ్నం వరకూ ప్రాక్టీస్ ఉంటుంది. ఈవెనింగ్ ఓ.కె.''

''థాంక్యూ కార్తీక్, రేపు ఫస్ట్ షో...శివమణి..మొదటిసారి నీతో సినిమా ప్రపోజ్ చేస్తున్నా..ప్లీజ్ కాదనకు..''

''ఇట్స్‌మై ప్లెజర్ విషీ...అరగంట ముందుగా నీకోసం థియేటర్ వద్ద వెయిట్ చేస్తుంటా..ఓ.కే.'' ఉత్సాహం కార్తీక్‌లో.

''థాంక్యూ..బై..బై'' లైన్ కట్టయింది.

★ ★ ★

టిక్కెట్లు తీసి పావుగంటయింది. విసుగ్గా ఉంది కార్తీక్‌కి. అంతలోనే సెల్ రింగైంది. ''హలో'' అన్నాడు విసుగ్గా.

''సారీ కార్తీక్'' పలికింది వైష్ణవి కంఠం.

''వెంటనే వచ్చేయ్. టిక్కెట్లు రెడీ'' ఆదుర్దా కార్తీక్ గొంతులో.

''నేను చెప్పేది విను కార్తీక్'' ముద్దుముద్దుగా చెప్పింది.

''సరే చెప్పు''

''సరిగ్గా ఇప్పుడే ఆర్ముగం అంకుల్ వచ్చారు. ఏదో ఫంక్షన్‌కి నేను వెళ్లాలిట. డాడీ కూడా ఒప్పుకున్నారు''

'ఏం చెయ్యాలా?' అన్నట్లుగా నీరసంగా చెప్పింది.

''టిక్కెట్స్ చించెయ్యనా?'' నవ్వుతూ అడిగాడు.

''ఈ ఒక్కసారికి ఉపయోగించెయ్..ప్లీజ్'' అని లైన్ కట్ చేసింది.

టిక్కెట్లు నలిపెయ్యబోతూ ఎడమవైపు కార్నర్ కేసి యధాలాపంగా చూశాడు. సినిమా రిలీజై వందరోజులు దాటిపోవడంతో రష్ ఎక్కువగా లేదు. శీతాకాలం ఆరుదాటడంతో చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి.

ఆ కార్నర్‌లో అందమైన ఓ అమ్మాయి. భయంగా దిక్కులు చూస్తోంది. ఓ నలుగురు పోకిరీ కుర్రాళ్లు ఆ 'అందాన్ని' అల్లరి చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు.

వెంటనే షర్ట్‌ని మోచేతులు దాకా మడచి వాళ్లని ఎదుర్కోడానికి సిద్ధమయ్యాడు. అంతలోనే ఆలోచించి రూటు మార్చి..ఆ అమ్మాయిని సమీపిస్తూ..

''రాణీ..నువ్వు ఇక్కడ ఉన్నావా? నేను టిక్కెట్లు తీసి పది నిముషాలైంది. కమాన్..'' అంటూ ఆకతాయి మూకను తప్పించుకోమన్నట్లు సైగ చేశాడు.

ఆశ్చర్యం ఆపుకోలేనట్లు కుర్చీలో కూర్చుంటూ-

''థాంక్యూ...రౌడీల నుండి నన్ను తప్పించారు. కానీ నా పేరు రాణియే అని మీకెలా తెలిసింది?'' ప్రశ్నించిందామె. నిజానికామె పేరు అభిసారిక.

అమృతం తాగిన కోకిలను పోలి ఉందామె కంఠం.

''సౌందర్యపు సామ్రాజ్యానికి రారాణిలా ఉండేసరికి... అయినా నాకో డౌటు..ఒంటరిగా మీలాంటి వాళ్ళు ఇలా రావడమేమిటి?'' ప్రశ్నార్ధకంగా చూశాడతని.

''ఓ ఫ్రెండు హ్యాండిచ్చింది. పోతే పోనీలెండి....ఓ హ్యాండ్సమ్ ఫ్రెండయ్యాడుగా..ఇక సిన్మా చూద్దామా?'' అంటూ హాండ్ రెస్ట్‌పై ఉన్న అతని చేతిని మృదువుగా నొక్కిపట్టుకుంది.

షాక్ తిన్నట్లు ఆమె మొహం వైపు చూశాడు. అదేం గమనించనట్లు ఆమె సినిమాలో లీనమై ఉంది. ఆమె నుండి తన చేతిని వెనక్కు తీసుకున్నాడు.

సినిమాలో ఆలీ రక్షితతో డైలాగ్ చెబుతున్నాడు...

''చూడు చెల్లెమ్మా..ఈ ఇంట్లో మీ ఇద్దరే రాత్రంతా ఏకాంతంగా ఉండబోతున్నారు. మా వాడికసలే కొత్త..కొంచెం సెన్సిటివ్.. రఫ్‌గా హ్యాండిల్ చెయ్యకు.''

డైలాగ్ వినగానే కిసుక్కున నవ్విందామె. తనవైపు చూసిన కార్తీక్‌తో ''మీ పేరు కూడా శివమణేనా?'' అంది అల్లరిగా. ''యూ సిల్లీ'' అంటూ ఆమె భుజమ్మీద గిచ్చబోయాడు. చీకట్లో అతని చేయి పొరపాటుగా కదిలి ఆమె అందాలను

తాకింది. సారీ చెప్పబోతున్న అతని కేసి చూస్తూ..''ఇట్స్ ఓ.కే..మూవీ పూర్తవ్వగానే నన్ను మా ఇంటి వద్ద డ్రాప్ చేస్తే చాలు..'' అంది.

సినిమా పూర్తయ్యే వరకు ఆటపట్టిస్తూనే ఉందామె.

బైక్ దిగుతూ ''రండి ఇల్లు చూద్దురుగానీ'' అని తాళం తీసి హాల్లో కూర్చోబెట్టి ''కాఫీ తయారుచేస్తా, ఫైవ్ మినిట్స్ వెయిట్ చేస్తారా?'' అంది అభిసారిక ప్లీజింగ్గా. ''అలాగే..నాకూ ఐదు నిముషాల పని ఉంది'' అని బయటికెళ్లాడు.

ఫ్రెష్గా స్నానం చేసి పొగలుకక్కే కాఫీతో ఆమె హాల్లోకి వచ్చేసరికి లోనికి ఎంటరయ్యాడు కార్తీక్.



కాఫీ అందుకుని ఆమె వైపు చూశాడు. తెల్లని ట్రాన్స్పరెంట్ నైటీలో ఆమె అందాలు ఆరారగా, రారమ్మంటున్నట్లు, ఆమె రాసుకున్న చందన సుగంధం కోర్కెల్ని రెచ్చగొడ్తున్నట్లున్నాయి.

ఆమె వైపు చూస్తూ కాఫీ సిప్ చేశాడు.

''బావుందా?'' నిషాగా అడిగిందామె. రోజా పూల కదలికలను ఆమె పెదాలు గుర్తుచేస్తున్నాయి.

''కాఫీ అమృతంలా రుచిగా ఉంది. బట్...మనం ఇంకెప్పుడూ కలియకుండా ఉండాలని నా కోరిక'' చురుగ్గా చూస్తూ బుల్లెట్ పేలినట్లు చెప్పి బైక్ పైకి జంప్ చేసి తుపానులా పోనిచ్చాడు బైక్ని.

అతని సమాధానం విని స్థాణువులా మారిపోయింది అభిసారిక.

సరిగ్గా పదినిముషాలు క్రితం పక్కింటి పింకీ ఇచ్చిన లెటర్ అందుకుని గదికెళ్లి ఓపెన్ చేసింది వైష్ణవి.

''గుడ్ బై వైష్ణవీ... అభిమానం, అనురాగం, అంగీకారం, ఆకర్షణ అనేవి ప్రేమకు నాలుగు గోడలైతే...

ఆ గోడలు నిల్చునేందుకు పునాది 'నమ్మకం'. రెండేళ్ల పరిచయం..ఆపై ఒక ఏడాది ప్రేమ..ఇంత జరిగిన తర్వాత కూడా నీవు నన్నిలా పరీక్షించటం..అంటే నాపై నీకు నమ్మకం లేకపోవడమే ?!

... ఒక అందగత్తెని సినిమా థియేటర్లో నా పైకి ఉసిగొలిపి... ఆమె అవకాశం కల్పించినప్పుడు...

నేను శారీరక ఆకర్షణకు లోనై...

తప్పు చేస్తే ఓడినట్టూ...

తిరస్కరిస్తే గెలిచినట్టూ...

ఇది నీ థియరీ.

ఆలోచించి చూస్తే ఇది ఎంత చీప్ ట్రిక్కో నీకూ తెలుస్తుంది. తన పేరు..అభిసారిక...నాకూ తెలుసు ఆమె నువ్వు పంపిన కాల్గర్లని..ఆమెను బైక్పై డ్రాప్ చేస్తుంటే...రాత్రి తొమ్మిదింటికి లలాట అక్కడే తచ్చాడటం...వెంటనే అనుమానమొచ్చి ఫోన్ చేస్తే నీవే రిసీవర్ లిఫ్ట్ చేయటం గమనించాను.

అప్పుడనిపించింది. నీలాంటి అనుమానపు భార్యతో కలసి ఉండటం కంటే చదువుకునే సమయంలో ప్రేమకంటే సరస్వతీదేవితో స్నేహం చేస్తే మేలని.

అపనమ్మకపు ప్రేమని నిర్మూలించిన నా 'భవిత' 'వాగ్దేవి' ని జయిస్తుందన్న నమ్మకంతో...

బై ఫరెవర్

కార్తీక్.